


యామిని

ఎప్పుడో మెల్లగా మూతలుపడిన జయలక్ష్మి కళ్ళు తెరుచుకున్నాయి. తిరిగి కళ్ళు మూసుకుందామని ప్రయత్నించింది జయలక్ష్మి. కాని చంటిది రెండు కాళ్ళూ బాబు ముఖంమీద వేసిపడుకున్న దృశ్యం కళ్ళకు ఎదురుగా కనబడింది. లేచితిద్దామా అనుకుంది. 'దాన్ని కదిపితే కందిరీగల తుట్టె. రాత్రంతా ఇంటి కప్పెగిరిపోయేలా దాని కంఠం పోయేవరకూ ఏడ్చిఏడ్చి పడుకుంది. పాడు దగ్గొకటి నాలుగురోజుల నుంచి దాని ప్రాణం తీస్తోంది దాంతోటి తనకీ నిద్ర ఉండటంలేదు. కళ్ళు భగ్గున మంటలు. ఏ పనీ తోచకుండా తల నొప్పి. నిద్రపోదామని ప్రయత్నిస్తే అది అసలు రావటంలేదు. ఎప్పుడు కళ్ళు మూతలు పడ్డాయో తెలియదు. గడియారం గంట లకు మెలకువవచ్చేసింది. టైమెంతయిందో ...ఇప్పు డది లేచిందంటే తను మాటెలా ఉన్నా పక్కవాళ్ళు కూడా లేచి కూర్చుం టారు.' జయలక్ష్మి పాపను కదపడానికి సాహసించలేను. తిరిగి కళ్ళు మూసుకుంది. కొద్దిగా దాహం వేస్తున్నట్లనిపించింది. లేవడానికి బద్ధకం.

జీరోవాట్ బల్బు చుట్టూ రెండు దీపం పురుగులు ఆడుకుంటున్నాయి. చిట్టెలుక ఒకటి గోడవారే పరిగెత్తుకొచ్చి దారిలో రెండుచోట్ల ఆగి ఉడుతలా కూర్చొని ఎవరైనా వస్తున్నారేమోనన్నట్లు చూసి టేబిల్ కింద ఉన్న బూట్లచుట్టూ రెండు ప్రదక్షిణాలు చేసి ఓ బూటులో దూరింది.

జయలక్ష్మికి దాహం ఎక్కువవుతూ న్నట్లనిపించింది. అయినా లేవ బుద్ధి కావడంలేదు. వంటింట్లో కుళాయిలోంచి ఆగాగిపడుతూన్న నీటి చుక్కల చప్పుడు మరోపరిస్థితుల్లో ఆమె చెవుల్లో దూరేది కాదేమోగాని ఇప్పుడది క్రమంగా అంతంత చెవులపక్కన్నే సుత్తితో కొడుతూన్నంత చప్పుడుగా వినిపిస్తూంది. తలుపు పక్కగా పెట్టిన మంచినీళ్ళగిన్నె, ప్రక్కనే గ్లాసు లైటు వెలుతురులో మెరుస్తున్నాయి.

రోడ్డుమీద దూరంగా చెప్పుల చప్పుడు వినవస్తూంది. క్రమంగా అది దగ్గరవు తూంది. వాళ్ళ మాటలు. మధ్యలో పక పకలు బాగా దగ్గరై ఆమె గుండెలమీంచి పోతూన్నట్టుగా అనిపించింది. ఆ శబ్దాలు పూర్తిగా వినబడకుండా దృష్టి మరల్చుకో లేకపోయింది జయలక్ష్మి.

బూటులో చిట్టెలుక కిచకిచమంది. మరో ఎలుకవచ్చి కాపలా కాస్తూన్నట్లుగా బయట నిల్చుంది జీరోవాట్ బల్బు వెనుక నున్న దూలంనీడ నాటకాల్లో విష్ణుచక్రం ఆకారంలో పెద్దదిగా వెనుకగోడమీద పడు తూంది. ఆ నీడ బయట ఒక బల్లిగోడ నంటిపెట్టుకొని ఉబికిన కళ్ళతో దీపంవైపు చూస్తూంది. దీపం చుట్టూ ఇంకా ఒక పురుగు తిరుగుతూంది.

జయలక్ష్మి దాహం ఇంకా బద్ధకాన్ని

జాయించలేదు.

నిద్రలో దాహంవేస్తే జీవుడే వెళ్ళి దాహం తీర్చుకోడానికి ప్రయత్నిస్తుందిట అని చిన్నప్పుడు నాయనమ్మ చెప్పినమాట సడెన్‌గా గుర్తుకు వచ్చింది జయలక్ష్మికి, అందుకనే జయలక్ష్మి చిన్నప్పటినుంచీ పడుక్కోనేటప్పుడు ఓ గ్లాసుడు మంచినీళ్ళు తాగి పడుక్కోవడం అలవాటు చేసుకుంది. ఈ వేళ తాగినా మళ్ళీ దాహం వేస్తోంది. అది గుర్తుకు రాగానే ఇంక లేవడం తప్పని సరనిపించింది జయలక్ష్మికి.

లేవబోతూ జయలక్ష్మి తల పక్కకు తిప్పింది. ఆమెకు ఎంతో ఆశ్చర్యం కలిగింది. వెల్లకిలా పడుక్కొని రెండు కళ్ళూ పూర్తిగా తెరచి సోమయాజులు ఇంటి కప్పు వైపు చూస్తున్నాడు. రెండు చేతులూ ముడుచుకొని తలక్రింద పెట్టుకున్నాడు.

జయలక్ష్మి తాత్కాలికంగా దాహం మాట మరచిపోయింది. అతనివైపు తిరిగి తనతల అతని చేయిమీద పెట్టుకొని దగ్గరగా జరిగింది. ఒకచేయి అతనిమీద వేసింది. కాని సోమయాజులు దృష్టి మరల్చలేదు. జయలక్ష్మి అతని ముఖంలోకి చూసింది.

'నిద్రపోవే లేదా ?'

సోమయాజులు ఉలిక్కిపడ్డట్లుగా కళ్ళు రెపరెప లాడించేడు.

'ఊహూఁ!'

'టైమెంతవుతుంది?'

'ఇప్పుడే పక్క వాళ్ళ గడియారం కొట్టింది పన్నెండై యుండాలి.'

జయలక్ష్మి కొంచెం విస్మయంతో అలాగే చూసింది కొంచెంసేపు.

'ఈ ఆలోచన అంతా కథలగురించేఁ'

'ఊఁ!' పరాకుగా సాగదీశాడు సోమయాజులు.

'ఎందుకొచ్చిన కథలండీ పగలూ రాత్రీ లేక ? ఆర్నెల్లకో ఏడాదికో ఓ కథ అచ్చవుతుంది. పది తిరిగొస్తాయి. వాళ్ళిచ్చే పదికీ పదిహేనుకు జవాబుల్రాని పదుత్తరాలు...'

చాలన్నట్లు చూసేడు సోమయాజులు.

'వాటిని గురించి మాట్లాడొద్దని నీ కన్నిసార్లు చెప్పేను. నాపిచ్చి నాది. నువ్వు హాయిగా పడుకోరాదూ?'

'నేనుమాత్రం ఏమన్నానండీ?'

'ఇంకా అనేదేమిటి? అన్నాచాలు.'

'బాగుందండీ. అన్నీ మీరే అనుకుంటున్నారు.' అంటూ లేచి జయలక్ష్మి మంచి నీళ్ళు తాగివచ్చింది. 'మంచి పనిలో ఉన్నప్పుడు పిలిచి మీరు కథ వినమంటారు. నాకు తీరిక ఉండదు ఇప్పుడు చెప్పండి కథ నాకూ నిద్రరావటంలేదు.' అంటూ జయలక్ష్మి మళ్ళీ పడుకుంది అతనివైపు తిరిగి.

'ఏదో సామెత చెప్పినట్లుంది...' అన్నాడు సోమయాజులు ఆమెవైపు చూడకుండానే.

సోమయాజులు రెండు నిమిషాలు మాట్లాడలేదు. ఉన్నట్లుండి హఠాత్తుగా జయలక్ష్మివైపు చూసి 'కథ చెప్పమన్నావా?' అన్నాడు కుతూహలంగా

'చెప్పండి.' అంది జయలక్ష్మి నిర్లిప్తతతో.

'చివరిదాకా వినగలవా?'

'ఏం? కథ బాగా పెద్దదా?'

'పెద్ద పెద్దదేం కాదు. కాని నువ్వు చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోడానికి ప్రయత్నించాలి...' అని ఆగి 'కథ కొంచెం...' అనేసరికి 'మీరు చెప్పండి! కథ కంటే ఉపోద్ఘాతం ఎక్కువయేటట్లుంది' అంది జయలక్ష్మి

సోమయాజులు మూతిబిగించిచూసేడు మళ్ళీ ఒక్కక్షణం కళ్ళు మూసుకొని పెద్దగా ఊపిరి పీల్చి కళ్ళు తెరచి ఊపిరి విడిచేడు. 'సరే!' అని కనుబొమ లెగరేసి సవాలు చేస్తున్నట్లుగా మొదలుపెట్టేడు

'ఒకతనుఉంటాడు.. అతనెలా ఉంటాడో ఒడ్డూ, పొడుగూ, రంగూ ఇవేవీ నీకక్కర్లేదు.. ఎందుకంటే కథలో అతని మనస్సుకేకాని రూపానికి ప్రాముఖ్యం లేదు. సరిగా చెప్పాలంటే కథ జరిగింది అతని మనస్సులోనే. కథ మధ్యలో ఎక్కడో మొదలుపెట్టి తరువాత ముందూ వెనుకా ఏదో చెప్తామనుకో వ్రాసేటప్పుడు...నీకు మాత్రం డైరెక్టుగా చెప్పేస్తాను. ఏం! ...ఒకతను ఉంటాడు ... ఇంకోటి! అతని సాంఘికపరిస్థితి మాత్రం నీ మనసులో కథ చిత్రించుకోడానికి కొంత అవసరం. అతనెక్కడైనా...అంటే ఏ గవర్నమెంటుఆఫీసులోనో, ఏ బ్యాంకులోనో, లేకపోతే ఏదో ప్రైవేట్ కంపెనీలోనో పనిచేస్తుంటాడు వయస్సు ఏదో ముప్పైరెండుంటుందనుకో. పెళ్ళాం, ఒకళ్ళిద్దరు పిల్లలూ ఉన్నవాడు. అతనిలో పెద్ద ప్రత్యేకమయిన ఇదేమీ ఉండదు. సామాన్యమైన అనుభవాలు కలవాడు. అంటే బ్రతుకులో వెలుగునీడలు ఓమాదిరిగా చవిచూసి ఉంటాడు. కొత్త మెరుగులు మాసిపోయి సంసారం కొంచెం బాధ్యతాయుతమైనదే అనే భావానికివచ్చేడు. నీకు వెంటనే ఓ సందేహం కలగాలి... అతను సంసారంలో పూర్తిగా సంతృప్తి పొందేడా లేదా అని. అంటే ఒకప్పుడు పూర్తిగా సంతృప్తి పొందుతున్నాననే అనుకున్నాడు. కాని కథ జరిగే సమయానికి మాత్రం పొందాల్సినంత పొందలేదేమో ననుకుంటూ ఉంటాడు. అర్థమయిందా? ఇదంతా బ్యాక్‌గ్రౌండు...'

'అతని పెళ్ళాం చాలా బాగుంటుందా?'

'మొదలు పెట్టేవు చొప్పదంటు ప్రశ్నలు. కథలో నీ కెక్కడయినా అర్థం కాక అనుమానమొస్తేనే అడుగుతూండు చెప్పవలసిన వివరాలు నేను చెప్తూంటాను అసలు అతని పెళ్ళాం పిల్లలు కథలోకి రారు.'

'సరే చెప్పండి.'

'కథ ఇక్కడే హైదరాబాదులో జరిగిందనుకో అతను రోజూ ఆఫీసు కెళ్ళాలంటే సిటీ బస్సులో ఆరేడుమైళ్ళ దూరం వెళ్ళవలసిఉంటుంది. ఇంక జాగ్రత్తగా విను. కథ మొదలవుతూంది.........అతను ఒక రోజు ఉదయం తను బయలుదేరే బస్ స్టాప్‌లో ఒక అమ్మాయిని చూసేడు చూసీ చూడగానే ఏదో మంత్రం వేసినట్లుగా అలాగే నిల్చుండిపోయాడు. ఆ అమ్మాయికి పదహారు పదిహేడేళ్ళ వయస్సు ఉండొచ్చు. తోపు రంగు పరికిణీ, అదే రంగు వోణీ, తెల్లని బ్లౌజు ... స్కూలు యూనిఫారంలో ఉంటుంది. చామన చాయగా ఉంటుంది. అయినా అంత అందమయిన అమ్మాయిని అతని జీవితంలో అప్పటిదాకా చూడలేదనిపిస్తుందతనికి. ఇదివరకు నా కథల్లోలా చక్రాల్లాంటి కళ్ళూ చిన్న ముక్కూ, అద్దాల్లాంటి చెక్కిళ్ళూ అంటూ వర్ణించడతను ఆమెను. ఎందుకంటే ఇవన్నీ ఉన్నా మనిషి అందంగా ఉండాలని లేదు ఏమిటో అదో అద్భుతమయిన అపురూపమయిన రూపు. అప్పటికప్పుడు పరిసరాలను మరపింప జేసేటంత అందం ఆమెది...'

'చిన్న సందేహం' జయలక్ష్మి అడ్డు వచ్చింది.

సోమయాజులు కనుబొమలుముడిచి చికాగ్గా

అమెవైపు చూసేడు.

'అతను అలా వర్ణించడు అన్నారు. వర్ణిం చాల్సిన అవసరం ఎందుకొస్తుంది? అదంతా అతని మనసులో జరిగిందేగా? అతనే మయినా రచయితా?'

సోమయాజులు కొంచెంసేపు ఆలో చించేడు.

'ఏ సందేహం బాగానే ఉందికాని...ఏడ్చి నట్లుంది. ఎందుకు బాగుందంటే ఇది పిబ్రరకు రావలసిన సందేహంకాదు. అదీ కాక నువ్వు అడిగినవెంటనే నాకూ అను మాన మొచ్చింది. అతను రచయిత కావాలా అక్కర్లేదా అని...ఎందుకు ఏడ్చినట్లుం దంటే అతను రచయిత కాకపోయినా కథ వ్రాసేటప్పుడు నేను అతనిమనస్సు వ్రాయా లిగా! అందుకని ఎలాగైనా వ్రాయాల్సి ఉంటుంది. అంచేత ఆ ప్రశ్న దండుగ. అదీ కాక అతను రచయిత అయినా ఫరవాలేదు కాని...అతను రచయిత కానక్కర్లేదు. ఎందు కంటే ప్రతి కథా నాయకుడిలోనూ అన్ కామన్ టేలెంట్సు పెడితే కథ వాస్తవానికి దూరంగా కనబడుతుంది...'

జయలక్ష్మి ఏదో అడగబోయి మానేసి 'సరే చెప్పండి' అంది.

'.. ఆమె చాలా నిరాడంబరంగా ఉంటుంది. స్కూలు యూనిఫారంలో ఉందని చెప్పే మగా. ఇంకా రెండుచేతులకూ వాలుగేసి

# వేసవివసంతం

నలల రంగుల గాజులు, మెడలో ఒంటిపేట గొలుసు, నుదుట చిన్న తిలకం బొట్టు, వెనకాల జడలో ఓ గులాబిపువ్వు, చేతుల్లో చేతులు పట్టనన్ని పుస్తకాలు...ఆ అమ్మాయి తలతిప్పి తనవైపు చూడడం మానీ బాగుండ దని అతను ఇటూ అటూ చూస్తాడు ఇంతలో బస్సువస్తుంది. హంసలాంటి నడ కతో ఆ అమ్మాయి బస్సుఎక్కి వెళ్ళి పోయింది.

కాని అతను తరువాత వచ్చిన బస్సులో ఎక్కి కూర్చున్నా ఆ అమ్మాయిని మరచి పోలేక పోయాడు. ఆఫీసు కెళ్ళేవరకూ ఆమెనుగురించే ఆలోచించేడు అతను. ఆ అమ్మాయిపేరు 'మాలతి' అయితే బాగుం టుందను కన్నాడు. మాలతి అన్న పేరుకు అతని మనసులో అవ్యక్తంగా మెదిలే రూపా నికి ఆమె సజీవచిత్రం అనిపిస్తుంది అందు కనే అతను ఆమెను తన ఆలోచనలో మాలతి గానే అనుకుంటూంటాడు. ఆఫీసు కెళ్ళ గానే పనిలో ఆమెను మరచిపోయాడు కాని ఆఫీసు వదలి ఇంటికి వచ్చేటప్పుడు ఆమె మళ్ళీ గుర్తుకువచ్చింది. యథాలాపంగా బస్సు దిగేక ఇటూ అటు చూసేడు ఆమె కన బడుతుందేమోనన్న ఆశ లేకపోలేదందులో. అతనికి వెంటనే గుర్తుకువచ్చింది స్కూల్సు

అఫీసులకంటె తొందరగా విడుస్తారని.


తరువాత రెండు మూడురోజులు మాలతి అతనికి కనబడలేదు.

శనివారం వచ్చింది బస్ స్టాపులో ఒక యువతి, ఒక ముసలాయన, ఇద్దరు స్కూలు విద్యార్థులూ ఉన్నారు అతను మాలతి ఎటునుంచి వస్తుందో తెలియక రోజూ లాగే నాలుగు వైపులా చూస్తాడు. తిరిగి తల తిప్పేసరికి బస్ స్టాపులో ఉన్న అమ్మాయి తల ఇటు తిప్పింది. అతను ఆశ్చర్యపోయాడు. ఆమె మాలతే! యూని ఫారంలో కాకుండా ఎర్రని పూలున్న గులాబిరంగుచీర కట్టుకొచ్చింది తలంటి పోసుకుంది. వెంటనే అతనికి శనివారం సంగతి గుర్తుకొచ్చింది. యూనిఫారంలో అందమూ అనాకారితనమూ అంతగా కన బడవు. అందులో ఉన్న వాళ్ళందరూ ఒక జాతిగా కనబడతారు. అయినా మాలతి యూనిఫారంలో కూడా ఎంతో అందంగా కనబడింది. ఇంక ఈ రోజు సంగతి వేరే చెప్పనక్కర్లేదు. అతని మనసు సంతో షంతో నిండిపోయింది. ఆమెను పరిశీలనగా చూస్తాడు. ఆమె ధరించిన ప్రతి వస్తువు లోనూ ... అంటే ఆమెచీర కొంగులోంచి బయటికొచ్చి గాలికి రెపరెపలాడుతూన్న దారం పోగులో కూడా ఏదో ప్రత్యేకమైన సౌందర్యం కనబడుతుందతనికి

ఆరోజు ఆఫీసులో అతనేదో డిపార్టు మెంటల్ టెస్టు పాసయినట్లు తెలుస్తుంది. తనకు ఆరోజు మళ్ళీ మాలతి దర్శనం కావ డమే దానికి కారణం అనుకుంటాడతను.

'అదేమిటండీ! ఆమె కనబడకపోతే అతను ప్యాసు కాకపోయేవాడా?'

'అబ్బబ్బ! అదికాదు. పరీక్షకు బాగా చదివేనని, బాగా వ్రాసేనని, అందుకే పాసయ్యేనని అతనికీ తెలుసు. కాని ఆమె కనబడడంమూలాన ఆరోజు పాసయినట్లు తెలిసిందనుకోవడంలో అతనికో ఆనందం. మనం దేవుడి దయవలన ఎన్నో జరిగేయని అనుకోమూ? అన్నీ లాజికల్‌గా ఆలో చిస్తామా? నీ తెలివి తేటలు కాస్సేపు పక్కకు పెట్టి అతని సెంటిమెంట్ అర్థం చేసుకో డానికి ప్రయత్నించు......ఏం!......తరువాత అప్పుడప్పుడు ఆమె అతనికి బస్ స్టాపులో కనబడుతూనే ఉంటుంది. రోజు రోజుకీ ఆమె అంటే అతనికి అభిమానం



దేహపుష్టికి ఆరోగ్యానికి
పండిత-డి గోపాలాచార్యుల వారి
జీవామృతం
69 సంవత్సరములనుండి ప్రసిద్ధి గాంచినది
ఆయుర్వేదాశ్రమం
ప్రైవేటు లిమిటెడ్
మదరాసు 17

పుస్తకములు

5 పుస్తకముల సెట్టు రు. 5–50
(1) కొక్కోకశాస్త్రం (2) సుహాగ్రాత్ (3) చుంబన పద్ధతులు, (4) 84 ఆసనములు, (5) రహస్యఫోటో ఆల్బం. ఒక్కొక్క పుస్తకం రు 2/–. పోస్టేజి, ప్యాకింగ్ అదనం. ఇంగ్లీషులో వ్రాయండి.
SULEKHA TRADERS.
(WAT 7) Beat No. 13 Aligarh.

టెరిలిన్ వస్త్రములు



టెరిలిన్ పాంటు మరియు షర్టు వస్త్రములు (1.25 & 2.25 మీ.) రెండున్నూ క్లియరెన్సు ధర రు. 28 50 లకే అమ్మబడును. V.P.P ఛార్జీలు రు 2 50 అదనం
ARVIND AGENCIES (APW-40).
P. O. Box 1408, Delhi-6

ఎలెక్ట్రిక్ & రేడియో గైడ్

ఎలెక్ట్రికల్ ఇంజనీరింగ్, రేడియో రిపేరింగ్ మెకానిజం, అసెంబ్లింగ్, ఎలెక్ట్రికల్ సూపర్ వైజరీ, వైరింగ్ వగైరాల పూర్తి కోర్సు నేర్చుకొనండి రు. 50 లకు ట్రాన్సిస్టరు రేడియో రుచేయుట కూడా నేర్చుకొనండి. మరియు ఎలెక్ట్రికల్ వర్క్ షాప్ ప్రారంభించండి. (800 బొమ్మలు) రు 12-50 వి పి. పోస్టేజి రు 2
Mahalaxmi Book Depot,
G B Road, (A E) Delhi 6.


# వేసవిపంబిబ్బు

పెరుగుతూనే ఉంటుంది.

ఇక్కడ ఆమెమీద అతనికున్న దృష్టిని నువ్వు తప్పుగా అర్థం చేసుకొనే ప్రమాదం ఉంది. అతనిదృష్టి పూర్తిగా శృంగార సంబంధమైనది అనుకోకు. అలా అని అది పూర్తిగా లేదనను. ఎందుకంటే తనకు వరుస కానటువంటి దగ్గర బంధువులైన స్త్రీ అతే తప్ప, స్త్రీపై పురుషుడి దృష్టిలో అది ఎప్పుడూ కొంత శాతం ఉంటుంది. కాని ఇక్కడ అతని అభిమానం దానికంటే అతీతమైనది. ఇంకా ఆ మాటకొస్తే శృంగార సంబంధమైన భావాన్ని నెగ్లెక్ట్ చేసినా ఫరవా లేదు ఎందుకంటే అతను ఉన్న పరిస్థితిని బట్టి అతనికా ఆశలెన్నడూ కలుగలేదు. కాని అమెదర్శనం అతని కళ్లకు పూలజల్లు లాంటిది అంతే!

ఇంకా వివరంగా చెప్పాలంటే అతనికళ్లకు ఆమెలో అతను వ్యక్తం చేయలేని పొటిలని అందం కనబడుతుంది. ఆమె అందాన్ని గురించి ఎవరితోనూ వాదించి వాళ్లకు నచ్చ చెప్పాలని ప్రయత్నించడు. అంతకంటే అందమైన వాళ్లను ఎవరైనా చూపిస్తానంటే అతనికి చూడాలనిపించదు. ఎందుకంటే ఆమె కంటె అందమైనవాళ్లు ఇంకొకళ్లు ఉన్నారను కోవడం అతనికి బాగుండదు. ఆమెపై అతనికెంతో ఆత్మీయత, జాలి కలుగుతుంది....

'జాలెందుకు? ఆమె ఏమైనా కష్టాల్లో ఉందా ?'

'నీది బొత్తిగా మట్టిబుర్ర సుమా ! కొడుకు పట్నవాసంలో ఉద్యోగం చేస్తున్నాడనుకో. అంతకంటె కష్టాలుపడుతూ పల్లెలో ఉన్న తండ్రి ఏమనుకుంటాడు ? 'పాపం మావాడు అపట్నంలో ఏం కష్టపడుతున్నాడో' అనుకుంటాడు. అక్కడ నిజంగా కష్టపడుతున్నాడా లేదా అన్నదికాదు. అతనిలో ఇతనికున్న అనుబంధం అటువంటిది. ఇక్కడ అటువంటి ప్రేమ లేదనుకో! అసలు ఉదాహరణకు చెప్పేను...'

'కథ చెప్పండి! ఏమిటో ఊరికే చెప్పినవే చెప్తున్నారు.'

'అసలు కథలో జీవం పీటలోనే ఉంది. కథ పూర్తయేలోపల ముగ్గురువచ్చి వలుగురు జైల్లు కాడితే సేగాని నీకు కథ విన్నట్లుండదు'

'ఏమిటీ కొంపతీసి కథయిపోయిందేమిటి?'

'లేదులే!...కథ ఇలాగే నడుస్తుంది వాలుగైదు నెలలు.

ఆమె బస్సులో తోటివాళ్లతో మాట్లాడుతూంటే ఆమె సెకండ్ ఫారం చదువుతూందనీ, ఆమె పరీక్ష నెంబరూ తెలుస్తాయి.

'ఇన్ని తెలిసి ఆమెపేరు తెలీదా?'

'మాటి మాటికీ అడ్డుపెట్టకు. తెలిస్తే నేను చెప్పనూ?'

'అది కాదండీ! కథలో అదికూడా తెలిసినట్లు రాయొచ్చుగా! లేకపోతే చూడండి. చదివిన తరువాత పేరు తెలీకపోడం అసంభవం అని చాలామంది ఉత్తరాలు రాస్తారు'

సోమయాజులు కొంచెంసేపు ఆలోచించేడు.

'సరే తెలియాలని ఏముంది? తెలీలేదు. నీ సలహాలు జాగ్రత్తగా అట్టిపెట్టు. కథంతా అయిపోయేక చెబుదువుగాని. .

...ఎంతవరకూ వచ్చింది? ఆ! ఆమె పరీక్షనెంబరు తెలుస్తుంది. అతను మాలతి రిజల్ట్సు వచ్చినప్పుడు పేపరు చూసేడు. ఎంతో ఆతృతగా. మాలతి సెకండుక్లాసులో పాసయింది. ఆరోజు అతని సంతోషానికి పట్టపగ్గాలు లేవు. ఎంత సంతోషమంటే ఆఫీసులో పనిచేస్తూండగా ఆమెను గురించి ఆలోచిస్తూంటే ఎందుకో కళ్లల్లోకి నీళ్లు కూడా వచ్చేయి.

సాయంత్రం ఇంటి కొచ్చేటప్పుడు స్వీట్సు కొనితెచ్చి ఇంట్లో అందరికి పెట్టేడు. పెళ్లాం అడిగింది ఇదేమిటని. ఈవేళ తినాలనిపించింది, తెచ్చేను అన్నాడు.

తరువాత ఇంచుమించుగా ఓ ఏడాది మాలతి కనబడలేదు కాని అతనిమనస్సులో ఆమె స్మృతులు మాసిపోలేదు. ఆమె ఎప్పుడో తిరిగి కనబడవచ్చుననే ఆశపోలేదు.

అలాగే మాలతి తిరిగి కనబడింది. కాని బస్సెక్కి పోతోంది. ఒకరోజు అతను ఆఫీసుకు వెడుతూంటే ఆమె రిక్షాలో అటు పైపే వెడుతూంది. అలాను తల తిప్పి వెనక్కు చూసేడు. ఆమె లేత ఊదారంగు చీర కట్టుకొనివుంది. ఆమె శరీరంలో కొంత మార్పు వచ్చింది. అది మార్పు

చేస్తేనయ్యన్ను. కొంచెం ఒళ్ళు చేసింది. ఒక్క క్షణం అతను ప్రపంచాన్నే మరచి పోయేడు ఆమె కంటికి కనిపించేంతవరకూ అలాగే చూసేడు. ఆమె మాత్రం అతన్ని చూడలేదు.

నాలుగురోజుల తరువాత అతను బస్ ఎక్కేసరికి అప్పటికే అందులో ఉంది మాలతి. తను పరిచయం గుర్తుకు వచ్చినట్లు చూసిందామె అతని వైపు. అతని క్షణంతో సంతృప్తి కలిగింది. ఆమె బస్సు దిగి ఓ గవర్నమెంటు ఆఫీసులోకి వెళ్ళింది. ఆమె అందులో పని చేస్తూందేమో నను కున్నాడతను.

రోజూ ఒకే బస్సులో వెళ్ళడంమూలాన ఆమెను గురించి అతని కెన్నో వివరాలు తెలిసేయి ఎటువంటివంటే ఆమెకు మొత్తం ఎనిమిది చీరలున్నాయనీ, రెండు జతల చెప్పులున్నాయనీ, ప్రతి శనివారం తలంటి పోసుకుంటుందనీ... వగైరా వగైరాలు కాని మొదటినుంచీ ఇప్పటివరకూ ఆమె స్వభావంలో అతని కేమీ మార్పు కనిపించదు. అంటే ఇప్పటికీ చాలా నిరాడంబరంగా ఉంటుంది......' సోమయాజులు ఆగేడు.

జయలక్ష్మి రెండు కళ్ళూ మూసుకొని ఉంది. ఒక అరనిమిషం సోమయాజులు మాట్లాడలేదు. అయినా జయలక్ష్మి కళ్ళు తెరవలేదు. ఉన్నట్లుండి 'ఎక్కడివరకూ చెప్పేను' అన్నాడు. ఆమె ఉలిక్కిపడి కళ్ళు తెరచి 'ఆఁ?' అంది.

'ఎక్కడివరకూ చెప్పేను?' సోమయాజులు మళ్ళీ అడిగాడు.

'ఊఁ!......నిరాడంబరంగా ఉంటుంది. వింటున్నాను చెప్పండీ!' అంటూ జయలక్ష్మి మళ్ళీ కళ్ళు మూసుకుంది. సోమయాజులు మొదలు పెట్టేడు.

'..... ఆమె బంధువు లెవరితోనైనా ఉంటుందేమో తెలీదు కానీ అతనికిమాత్రం ఆమె ఏకాకి అనిపిస్తుంది......ఆమె ఓ కొత్తచీర కొనుక్కున్నా, ఓ టిఫిన్ డబ్బా కొనుక్కున్నా, ఓ రిస్టువాచ్ గాని మరో హేండ్ బ్యాగ్ కాని కొనుక్కున్నా అందులో ఆమె ఎంతో జాగ్రత్తగా ఆలోచించి కొంటూన్నట్లనిపిస్తుం దతనికి తనే ఏదో కష్టపడి కావలసింది కొనుక్కున్నంత సంతృప్తి కలుగుతుం దనికి ఆమె ఏది కొనుక్కోవడం చూసినా......'

జయలక్ష్మి ఆవులిస్తూ కళ్ళు మత్తుగా తెరచింది. సోమయాజులు కొంచెం ఆగేడు ఆమెవైపు చూస్తూ.

'ఎలా తోస్తోందండీ మీకీ కథలూ? వాళ్ళోళ్ళకళ్ళకొకళ్ళు తెలియరట. ఎప్పుడూ మాట్లాడుకోరట. అయినా ఏమిటేమిటో చెప్పేస్తున్నారు. మీ రేమైనా అనుకోండి కానీ ఇటువంటి హరికథలు రాస్తే......'

'చాల్లే! వెర్రాడికి మొగలిపువ్విస్తే ఏదో చేశాట్ట! కాకపోతే నేను నీకు కథ చెప్పడ మేమిటీ?'

'ఆహాఁ! చెప్పండి. నా కంతగా నచ్చటం లేదు. కొంచెం మారుస్తే బాగుంటుందేమో నని సరే! చెప్పండి చెప్పండి.'

మళ్ళీ జయలక్ష్మి కళ్ళు మూసుకుంది. సోమయాజులు ఆమె కళ్ళు మూసుకోవడం చూస్తే కథ చెప్పడం మానేద్దా మన్నంత కోపం వచ్చింది. అయినా చెప్పకుండా ఉండలేకపోయాడు.

'......మాలతి రెండు నెలలు మళ్ళీ కనబడలేదు.'

జయలక్ష్మి కళ్ళు తెరువకుండానే చిన్నగా నవ్వింది.

'ఎందుకు నవ్వుతావ్?'

'మీ కథకు చక్కనిపేరు తోచింది నాకు' జయలక్ష్మి కళ్ళు తెరవడంలేదు.

'ఇంకా పూర్తిగా చెప్పకుండానే'

'ఏమో ఇప్పటికి తోచింది నాకు.'

'ఏమిటది?'


'దాగుడు మూతలు.'

'ఛీ! నోర్ముయ్.. అవును కానీ మాట్లాడేటప్పుడు కూడా గుడ్డిదానిలా ఆ కళ్ళు మూసుకోవడ మేమిటి? చూడలేవూ?'

'చెప్పండీ! ఇలా వింటే ఇంకా బాగా అర్థం అవుతుంది.'

'......మాలతి రెండు నెలల తరువాత ఒక సినిమాహాలుదగ్గర కనబడింది. ఆమెను చూసి అతను ఆశ్చర్యంతో ఉక్కిరి బిక్కిరయిపోతాడు,

ఆమె చాలా ఖరీదయిన కనకాంబరం రంగుచీర, అదే రంగు జాకెట్టూ ధరించింది ఇదివరకుకంటె పెద్ద కుంకుమబొట్టు, ముక్కుకు పుడక, చెవులకు ధగధగలాడుతూన్న ఒంటి నీలిరంగురాయి ఉన్న నక్షత్రం లాంటి దుద్దులు, వాటికి వ్రేలాడుతూన్న పొట్టి జూకాలు..... అతను ఆమె వైపు చూస్తూ దృష్టి మరల్చుకోలేకపోతాడు. రెండోవైపు భుజంమీంచి పైట కొంగు ముందుకు తీసుకొని నిల్చున్న ఆమెను



చూస్తే...ఆమె ఎన్నో సంవత్సరాలు పెరిగిపోయినట్లనిపిస్తుందతనికి. ఇక్కడ మన హీరోకి పేరు పెట్టడం అవసరం.. సరే! అతని పేరు రామమూర్తి అనుకో. ఆమె రామమూర్తి వైపు గతంలో పరిచయాన్ని స్ఫురింపజేసేట్లు చూస్తుంది కాని కోపంగా చూడదు. ఆమె తన ఒక్కడికే ఇస్తూన్న ప్రివిలేజ్‌గా రామమూర్తి దాన్ని ఫీలవుతాడు.

రామమూర్తికి వార్నింగ్‌లా కనిపించిన ఒక చూపు చూసి ఆమె రెండు టిక్కెట్లు తీసుకొని వస్తూన్న ఒక యువకుని వైపు నడచి నవ్వుతూ మాట్లాడుతూ అతనితో చేయి కలిపి లోపలకు వెళ్లిపోతుంది.

రామమూర్తికి సినిమా హాలులో వాళ్లెక్కడ కూర్చున్నారో కనిపించలేదు. అతని కళ్లు సినిమాను చూస్తున్నా అక్కడక్కడ కొన్ని భాగాలు అతని మెదడు చేరనేలేదు.

అతని మనస్సంతా మాలతిమీదే ఉంది. ఆమె యువకునితో మాట్లాడడంలో కనిపించిన సాన్నిహిత్యం పదే పదే అతని కళ్ల ముందు నిలుస్తోంది. 'బహుశా మాలతి పెళ్లి చేసుకొని ఉంటుంది.'

ఆ ఆలోచన అతని మనసులో ఎన్నో రకాల భావాలను రేకెత్తించింది. ప్రియమైన స్నేహితురాలు పెళ్లిచేసుకొని వెళ్లిపోతే ఆమె అంతరంగంలో మనకంటే ఎన్నో రెట్లు ముఖ్యమైనవాళ్లుగా మరొకళ్లు చోటు చేసుకున్నారనే అసూయలాంటిది—లేదా అంతకంటె...తన పరిచయం గడ్డిపోచపాటి విలువ చెయ్యనిదని గుర్తుకు రావడం—ఈ సుకుమార పుష్పాన్ని అతను ఎలా చూసుకుంటాడోననే ఆందోళన—ఆ యువకుడు కూడా రూపసి పచ్చని ఛాయ, బాగా పొడుగు.. స్నేహభావాన్ని పురికొల్పే ముఖం ... సంస్కారం ఉన్నవాడిలాగే కనబడ్డాడు...అందుచేత అతనిమీద కొంత విశ్వాసం.

ఇంటర్వెల్‌లో రామమూర్తి వాళ్లకోసం చూసేడు. కనబడలేదు వాళ్లు. బయటికొచ్చేడు. బయట ఇద్దరూ మాట్లాడుకుంటూ నిలబడ్డారు. అతను సిగరెట్ కాలుస్తున్నాడు. సరిగా రామమూర్తి బయటకు చూస్తూన్నప్పుడు ఆమె గేటువైపు చూస్తూ పైట సర్దుకుంది. మంగళసూత్రం ఒకసారి లైటు వెలుగుతో తళుక్కుమని తిరిగి పైటలో దాక్కుంది. తన ముఖంలో ఆశ్చర్యాన్ని గమనించి తనకు తెలియాలనే ఆమె అలా చేసిందనుకున్నాడు రామమూర్తి.

సినిమా అయిన తరువాత వాళ్లిద్దరూ ఒకే రిక్షాలో ఎక్కి వెళ్లిపోయారు. రామ్మూర్తి ఇంటికి వచ్చేటప్పుడు మామూలుగా ఉందామని ఎంత ప్రయత్నించినా ఉండలేకపోయాడు. అతనికి తెలియకనే అతని హృదయం బరువెక్కింది.

కొన్నిరోజులకు మాలతి వివాహిత అనే సత్యానికి అలవాటు పడ్డాడు రామ్మూర్తి.

మాలతి ఉద్యోగం మారినట్లుంది. రామ్మూర్తి బస్సులో రావడం మానేసింది. అయినా అప్పటినుంచీ ఆమె, భర్తా రోజూ ఒకే బస్సులో వెడుతూ కనిపించేవారు. వాళ్లు వెళ్లే బస్సు రామ్మూర్తి ఆఫీసు వీధుగా కాక ఒక ఫర్లాంగు ముందునుంచి మలుపు తిరిగి మరోదారిని వెడుతుంది. అయినా, వాళ్లను మిస్ కావడం ఇష్టంలేక రామ్మూర్తి తన బస్సు విడిచి ఆ బస్సులోనే వెళ్లేవాడు బస్ దిగాక ఫర్లాంగుదూరం తన ఆఫీసుకు నడచివెళ్లేవాడు...'

సోమయాజులు మళ్లీ ఆపేడు.

'వింటున్నావా?'

జయలక్ష్మి మాటాడలేదు.

'నిన్నే!' జయలక్ష్మి భుజం పట్టుకొని కదిపేడు సోమయాజులు.

'ఆఁ!' అంటూ ఉలిక్కిపడి ఏ పాపం ఎరుగనట్లు చూసింది జయలక్ష్మి.

సోమయాజులు ఆమె నిర్లిప్తతకు నిరసన తెలియ జేసే లోపల పాపకు దగ్గు వచ్చింది. బాబు ముఖాన్ని తన్నేసి రెండోవైపు తిరిగి దగ్గడం మొదలు పెట్టింది. జయలక్ష్మి వెంటనే మంచం దిగి పాప గుండెలపై మెల్లగా రాసింది. రెండు నిముషాలు పాపను జోకొట్టి తిరిగి వచ్చింది జయలక్ష్మి.

'ఊఁ!...సినిమాహాల్లో కనబడింది...... పెద్ద కుంకుమబొట్టు ... చెప్పండి...' తనకు నిద్రపట్టి కొంత వినలేదేమోననే అనుమానంతోనే అంది జయలక్ష్మి. సోమయాజులుకు చాలా కోపం వచ్చిందిగాని అది చూపించడంవలన ప్రయోజనం లేదనిపించి అక్కడివరకూ చెప్పింతే మళ్లీ చెప్పేడు.

తరువాత '......బస్సులో వాళ్లిద్దరికీ టిక్కెట్లు ఎవరో ఒకరే తీసుకొనేవారు. ఆమె దిగే చోటుకంటే ఆమె భర్త దిగే చోటు నాలుగైదు స్టాపుల దూరం.

మాలతి చాలా కొత్త చీరలు కొనుక్కుంది. ఎప్పుడో అప్పుడప్పుడు కాని పెళ్లికి ముందు కట్టుకున్న చీరల్లో కనబడేదికాదు. ఆమె భర్త టిప్‌టాప్‌గా ఉండేవాడు. అతను సినిమా యాక్టర్‌లా హావభావాలు చూపిస్తూ ఎప్పుడూ సిగరెట్ తాగుతూ ఏదో ఒకటి మాట్లాడుతూనే ఉండేవాడు. మాలతి ఊరికే వింటూనే ఉండేది. చాలా తక్కువ మాట్లాడేది.

ఒకరోజు ఇద్దరూ బస్సెక్కేరు. అతను ముందువచ్చి సీటులో కిటికీ వైపు కూర్చున్నాడు. మాలతి అతని వెనకాలేవచ్చి అతని ప్రక్కనే కూర్చుంది. ఆ రోజు రామ్మూర్తికి వాళ్ల ప్రవర్తన వింతగా కనబడింది. ఆమె భర్త రోజూలా మాట్లాడడంలేదు. సిగరెట్ తాగుతూ కిటికీలోంచి బయటకు చూస్తూ కూర్చున్నాడు. మాలతి తల వంచుకొని కూర్చుంది.

కండక్టర్ తమ దగ్గరకు రాగానే ఆమె భర్త తన కొక్కడికే టికెట్ తీసుకున్నాడు. అప్పుడామె, తన భర్త ముఖంలోకి చూసిన చూపు రామ్మూర్తి హృదయాన్ని కలచివేసింది. మాలతి తన టికెట్ వేరే తీసుకుంది. ఆమె ముఖం వాడిపోయివుంది. పక్క వరుసలో రెండు సీట్లు ముందుకు కూర్చున్న రామ్మూర్తిని చూసి తల దించుకుంది. జేబురుమాలుతో కళ్లు తుడుచుకోవడం చూసేడు రామ్మూర్తి. ఆమె భర్త అలాగే బయటకు చూస్తున్నాడు.

రామ్మూర్తికి అతనిపై ఎంతో కోపం వచ్చింది. సున్నితమైన మనస్సుకల మాలతిని అర్థం చేసుకోకుండా కష్టపెడుతూన్న కఠినుడని అసహ్యించుకున్నాడతన్ని.

ఆ మర్నాడు తిరిగి నవ్వుతూ బస్సెక్కిన ఇద్దరినీ చూసేసరికి రామ్మూర్తి మనస్సు కాస్త కుదుటబడింది.

ఇలాగే ఆమెను మామూలుకంటె భిన్నంగా చూస్తే రామ్మూర్తి మనస్సు గిలగిలలాడేది. ఎప్పుడైనా ఒక్కరోజు ఆమె కనబడక పోయినా ఏ జ్వరమయినా వచ్చిందేమోనని అతని మనస్సు పరిపరివిధాల పోయేది.

ఒక సంవత్సరం ఇలాగే గడచిపోతుంది. ఏడాది గడచిన తరువాత రామ్మూర్తి శలవు పెట్టి సంసారంతో వాళ్ళఊరు వెళ్ళి ఓ నెలఉండి వస్తాడు. వాళ్ళ ఊరువెళ్ళిన తరువాత రామ్మూర్తికి మొదటి నాలుగైదు రోజులూ ఏమీ అనిపించదు కాని తరువాత అస్తమానూ మాలతే గుర్తుకు వస్తూంటుంది. శలవు చివరి రెండు మూడు రోజులూ మరీ ముళ్ళమీద ఉన్నట్లుంటుం దతనికి. చివరకు ఎలాగైతేనేం మళ్ళీవచ్చి రామ్మూర్తి ఆఫీసులో చేరతాడు. ఆమెను చూసేవరకూ క్షణమొక యుగంలా గడుస్తుం దతనికి ఇన్నాళ్ళ ఆలోచనతో ఆమె ముఖమే పూర్తిగా మరచిపోయినట్లని పిస్తుం దతనికి.

చివరకు కనబడింది మాలతి మళ్ళీ భర్తతో. ఆమెభర్తలో రామ్మూర్తికి ఏ మార్పూ కనబడదు కాని మాలతిని చూస్తూంటే ఎవరో కొత్త స్త్రీని చూస్తూ న్నట్లనిపిస్తుంది...'

'అలా ఎలా అనిపిస్తుందండి?' జయలక్ష్మి ప్రశ్నించింది.

'నువ్వు నోరుమూసుకొని నేను చెప్పేది విను..' సోమయాజులు ఉద్వేగం చూస్తే ఆశ్చర్యం కలిగింది జయలక్ష్మికి.

'.. ఈ నెలరోజుల్లోనూ మాలతి బాగా ఒళ్ళుచేసి నట్లుంది కళ్ళకింద ఎముకలు కొంచెం తరిగినట్లున్నాయి. చెక్కిళ్ళు కొద్దిగా లోపలకు పోయాయి. నడకలో శ్రమ కనబడుతూంది.

మరో పదిహేను ఇరవై రోజులకు మాలతి గర్భవతి అయినట్లు స్పష్టంగా తెలుస్తూంటుంది.

నాలుగైదు నెలలు, అనుదినం గుర్తుపట్టలేని మార్పును మాలతిలో చూస్తాడు రామ్మూర్తి.

తరువాత రామ్మూర్తి ఆఫీసు షిఫ్టు చేశారు అతని ఆఫీసుదారి మాలతి దారికి పూర్తిగా వేరయింది అయినా ఒకరోజు ఏదో పనిమీద శలవుపెట్టి మామూలు టైముకువచ్చి ఆ బస్సులో ప్రయాణం చేశాడు రామ్మూర్తి మాలతి భర్త కనబడ్డాడు కాని మాలతి లేదు. పురిటిలో ఉన్న సంగతి గుర్తుకు వచ్చింది రామ్మూర్తికి.

రెండేళ్ళు గడచిపోయాయి. రామ్మూర్తి సంసారంలో జనసంఖ్య ఒకటి పెరిగింది అతను మళ్ళీ మాలతిని కాని ఆమె భర్తను కాని చూడడం తటస్థించలేదు. ఈమధ్యలో పది పన్నెండు సార్లు ఆరూట్‌లో వెళ్ళేడు రామ్మూర్తి. అయినా వాళ్ళు కనబడలేదు కాలంతో మాసిపోక మాలతి స్మృతి అతన్ని ఏకాంతంలో కలవరపెట్టేది,

రామ్మూర్తి స్నేహితు డొకడు బెంగుళూరునుంచి ఏదో పనిమీదవచ్చి హోటల్లో దిగేడు అఫీసుకు టైమయ్యేక రామ్మూర్తి దగ్గర కొచ్చేడు. రామ్మూర్తి ఓగంట పెర్మిషను తీసుకొని స్నేహితుడితో బయట కొచ్చేడు ఓ అరగంట అవీ ఇవీ మాట్లాడి స్నేహితుణ్ణి మ్యూజియం చూడ్డానికి పంపి తాను ఆఫీసు కొద్దామనే ఉద్దేశ్యంతో రామ్మూర్తి మ్యూజియంకు వెళ్ళేడు.

మ్యూజియం దగ్గర టిక్కెట్లు కొంటూన్న మాలతి భర్తను చూసి రామ్మూర్తి నిర్ఘాంతపోయాడు అతనిపక్క ఇరవైఏళ్ళ అమ్మాయి నిల్చొని అతని కళ్ళల్లోకి ఎంతో సన్నిహితంగా చూస్తూ ఇంగ్లీషులో మాట్లాడుతూంది మెడమీద వేలాడుతూన్న మంగళసూత్రం చూడగానే రామ్మూర్తి గుండె కలుక్కుమంది అది అతను తనచేత్తో కట్టిన లైసెన్సు బిళ్ళ కాగుకదా!...వాళ్ళు పకపక లాడుకుంటూ చేతులు కలుపుకొని పిల్లల వస్తుప్రదర్శన శాలలోకి వెళ్ళేరు. రామ్మూర్తి స్నేహితుణ్ణి లోపలకు పంపి తాను వెనక్కు వచ్చేడు,

రామ్మూర్తి హృదయంలో ఏదో బాధ గట్టిగా తెంచుకుంది. అప్రయత్నంగా కళ్ళల్లో నీళ్ళు నిండేయి. తిరిగి ఆఫీసుకు పోబుద్ధి కాలేదు ఓ షాపులోంచి ఆఫీసుకు రావటం లేదని ఫోనుచేసి వెళ్ళి పక్కనేఉన్న ఓ కొండెక్కి ఓ చెట్టునీడను కూర్చున్నాడు.

అతని మనస్సులో పెనుతుపాను లేచింది. మాలతి ఏమయింది? ఉందా? భర్త విడాకులిచ్చేడా? అంతఅన్యాయం చేశాడా?... లేకపోతే కనలేక ... సోమయాజులు గొంతు పూడిపోయింది.

మళ్ళీ పాప దగ్గడతో జయలక్ష్మి మంచందిగి వెళ్ళింది వెంటనే అతను అ రెండోపక్కకు తిప్పుకున్నాడు అతని కళ్ళల్లోకి ఉబికివచ్చిన కన్నీళ్ళు తలగడమీదకు జారిపోయాయి. రహస్యంగా 'మాలతీ!' అని నిశ్శబ్దంగా ఆక్రోశించిందతని మనస్సు

ఊపిరి సలపని దగ్గుతో పాప పెద్దగా ఏడ్వడం మొదలుపెట్టింది ●

